

రంజాన్ వేళలు

ఇఫ్తార్ - సోమవారం

సాయంత్రం - 6.28

సహార్- మంగళవారం

ఉదయం - 5.10



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న నేతలు

రాజ్యాంగంతోనే బడుగులకు న్యాయం

» యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజయ్

ఘట్‌కేసర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంతోనే నేడు బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల తోపాటు ఆర్థికంగా రాణిస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజయ్ అన్నారు. ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు బడుగు వర్గాల ప్రజలకు కనీసంఆలయాలకు వెళ్లలేని దయనీయ పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. అలాంటి అనేక అవాంతరాలను ఎదుర్కొనే ధైర్యాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలే నేడు బలహీన వర్గాలు అనుభవిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు మీసాల అరుణ్‌కుమార్, దాను, నర్సింగరావు, శ్రీనివాస్, రాజేశ్, రాహుల్, అరవింద్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ స్పీకర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, అధికారులు

మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు ఘన నివాళి

» కలెక్టరేట్‌లో నివాళులర్పించిన అధికారులు

వికారాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో ఆదివారం అధికారికంగా నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి మల్లేశం, క్రీడా అభివృద్ధి అధికారి హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్.. ప్లీజ్!


త్వరలో ఖాళీ కానున్న ఐదు సీట్లు

రేస్‌లో కాంగ్రెస్ అగ్ర నాయకులు

ఉమ్మడి జిల్లా నుంచి ముమ్మర ప్రయత్నాలు

పోటీలో మధుయాష్కీ, వంశీచందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సింగిరెడ్డి, మలిపెద్ది

ఎమ్మెల్సీ పదవులపై నేతల ఆశలు



పెద్దల సభలో అడుగుపెట్టేందుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నేతలు ముమ్మరంగా పోటీ పడుతున్నారు. 'ఒక్క ఛాన్స్ ఇవ్వండి.. ప్లీజ్' అంటూ పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అవకాశం కోసం రాష్ట్ర నాయకత్వంతో పాటు ఢిల్లీ పెద్దలనూ కలుస్తున్నారు. త్వరలో ఎమ్మెల్యే కోటాలో శాసన మండలికి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో 29వ తేదీ నాటికి ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. వీటి భర్తీకి 20న ఎన్నికలు నిర్వహించేలా నోటిఫికేషన్ కూడా వెలువడిన సంగతి తెలిసిందే. మొత్తం ఐదు స్థానాల్లో నాలుగు కాంగ్రెస్‌కు దక్కే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరికైనా అవకాశం లభిస్తుందా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది.

మేడ్చల్, మార్చి2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అనేక మంది ఆశావహులు ఈ పదవుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో వివిధ కారణాల వల్ల టికెట్ లభించని కొందరికి నామినేటెడ్ పదవులు ఇస్తామని అప్పట్లో పార్టీ అధినాయకత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు పలువురికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చి సర్దుబాటు చేసింది. ఇంకా కొందరికి ఎలాంటి పదవులు దక్కలేదు. వీరిలో కొందరు పెద్దల సభలో అడుగుపెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలంటూ అధిష్ఠానాన్ని కోరుతున్నారు.



కలిసిరానున్న సామాజిక సమీకరణాలు

ప్రస్తుతం రేస్‌లో మాజీ ఎంపీ మధుయాష్కీ, మాజీ ఎమ్మెల్యేలు వంశీచందర్‌రెడ్డి, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడి తదితరులు ఉన్నారు. గత ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందిన మధుయాష్కీ ఎమ్మెల్సీ సీటు కోసం

మిగతా 7వ పేజీలో...

నియామకం



ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాహుల్ యాదవ్

మేడ్చల్, మార్చి2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాహుల్ యాదవ్‌ను నియమించారు. ఆయనది మేడ్చల్ మండలం రావల్‌కోల్ గ్రామం. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు యాదవల్లి వెంకటస్వామి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధిష్ఠానం ఇచ్చిన బాధ్యతలకు పూర్తి న్యాయం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నీటి తొట్టెలు.. నిరుపయోగం



మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు కొడంగల్ మండల పరిధిలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. వాటికి అనుసంధానించిన మోటార్లు, పైపులు సైతం పనికిరాకుండా పోయాయి. దీంతో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు కాపరులు పడరాని పాట్లు పడుతున్నారు. నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లకు మరమ్మతులు చేసి నీటివసతి కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

-కొడంగల్ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి)

జాతీయస్థాయి పోటీల్లో దీపశ్రీ ప్రతిభ

» పోలీస్ వాటర్ బోట్ స్పోర్ట్స్‌లో మూడు పతకాలు కైవసం



దీపశ్రీని సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పరిగి, మార్చి2(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోలీస్ వాటర్ బోట్ స్పోర్ట్స్ పోటీల్లో పరిగి పట్టణానికి చెందిన కానిస్టేబుల్ కావలి దీపశ్రీ సిల్వర్ మెడల్, రెండు కాంస్య పతకాలను సాధించింది. ఆమె పరిగి పట్టణానికి చెందిన రిటైర్డు ఆర్మీ జవాన్ కె.లింగమయ్య కూతురు. ఆమె తెలంగాణ పోలీస్ తరఫున మధ్యప్రదేశ్ భూపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి పోలీస్ వాటర్ బోట్ స్పోర్ట్స్‌లో వేయిమీటర్లు పోటీల్లో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించింది. అలాగే 400మీ., 200 మీ. పోటీల్లో రెండు కాంస్య పతకాలను సాధించింది. భూపాల్‌లో అక్కడి గవర్నర్, డీజీపీ చేతుల మీదుగా ఈ పతకాలను అందుకుంది. ఈ సందర్భంగా ఆదివారం పరిగిలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీపశ్రీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హన్మంత్, లక్ష్మయ్య, అనంతయ్య, అనిల్, శశిధర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, కుమార్‌గౌడ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

ప్రభుత్వ భూమిలో ప్రైవేటు రోడ్డు

కిలోమీటరుకు పైగా 40 ఫీట్ల రోడ్డు పనులు

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఇష్టారాజ్యం

కొత్రేపల్లిలోని సర్వే నంబర్ 164లో జోరుగా పనులు


ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న రియల్ వ్యాపారులు

పట్టించుకోని సంబంధిత అధికారులు

అక్రమార్కులకు అండగా అధికారులా? నేతలా?

వికారాబాద్, మార్చి2(ఆంధ్రజ్యోతి): అక్రమ సంపాదనే ధ్యేయంగా రియల్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. వికారాబాద్ అటవీ ప్రాంతంలో కొండలు, గుట్టల మధ్య వెంచర్లు ఏర్పాటు చేస్తూ విల్లాల నిర్మాణాలు చేపట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వ భూమికే ఎసరు పెట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్రేపల్లి రెవెన్యూకు చెందిన ప్రభుత్వ భూమిలో ఓ ప్రైవేటు వెంచర్ కోసం 40 ఫీట్ల రోడ్డు పనులను దర్జాగా చేస్తున్నారు. కొత్రేపల్లి పరిధిలోని సర్వేనంబర్ 164లో ప్రభుత్వం పలువురు రైతులకు లావణి పట్టాలతో భూమిని ఇచ్చింది. కాగా, సర్వే నంబర్‌లో ఇంకా కొంత భూమి మిగిలి ఉంది. ఆ దారిగుండా గతంలో మద్దులగడ్డ తండాకు వెళ్లే రోడ్డు వరకు 15 ఫీట్ల నక్షబాట ఉంది. ఆ రోడ్డు తర్వాత మొత్తం ప్రభుత్వ భూమి ఉంది. అయితే మద్దులతండా వరకు ఉన్న 15 ఫీట్ల రోడ్డును పక్కనే ప్రభుత్వ భూమిని కలుపుకొని 40 ఫీట్ల రోడ్డుగా మారుస్తూ దర్జాగా పనులు సాగిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా

మిగతా 8వ పేజీలో...



అటవీ ప్రాంతంలో చదును చేసిన ప్రదేశం

కఠిన చర్యలు తప్పవు

కొత్రేపల్లి పరిధిలోని సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా రోడ్డు వేస్తున్నారన్న విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆర్ఐని పంపించి పనులు ఆపాలని చెప్పాం. అయినా కూడా వారు అలాగే రోడ్డు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో రోడ్డు వేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

-లక్ష్మీనారాయణ, తహసీల్దార్, వికారాబాద్



రేయింబవళ్లు పనులు చేస్తున్నారు

మా గ్రామ సమీపంలోని 164 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా రోడ్డు వేస్తున్నారు. రేయింబవళ్లు పనులు చేస్తున్నారు. మా గ్రామానికి చెందిన రైతులు కొన్నేళ్లుగా అక్కడ సాగు చేసుకుంటున్నారు. కొంత భూమిలో మేము సాగు చేస్తుండగా మిగతా అంతా ప్రభుత్వ భూమినే ఉంది. అక్కడ ఏవో ఇళ్లు కడుతున్నారని ఇప్పుడు పెద్ద రోడ్డు వేస్తున్నారు.

-జంగం లక్ష్మి, కొత్రేపల్లి గ్రామం



జేసీబీతో రోడ్డు పనులు



అధికారులు సీజ్ చేసిన ఇసుక(ఫైల్)

ఇసుకే.. బంగారమాయెనా!

వేధిస్తున్న ఇసుక కొరత

నిలిచిపోతున్న భవన నిర్మాణాలు

వరుసగా డంప్‌లను సీజ్ చేస్తున్న అధికారులు

అమాంతం పెరిగిన ఇసుక ధరలు

ఆందోళనలో పేద, మధ్య తరగతి వర్గాలు

పనిలేక ఖాళీగా ఉంటున్న భవన నిర్మాణ కార్మికులు

మేడ్చల్, మార్చి2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇసుక ధర తగ్గింది.. దానికి తోడు సిమెంటు, స్టీలు రేటు కూడా తగ్గాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇదే అదునైన సమయం అంటూ ముహూర్తాలు పెట్టించి నిర్మాణాలు చేపట్టారు. పనులు ప్రారంభించాక ఒక్కసారిగా ఇసుక దొరకడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వానికి డీడీలు చెల్లించి నదుల నుంచి ఇసుక లోడ్‌లు తీసుకొచ్చి ఖాళీ స్థలాల్లో ఇసుక డంపింగ్ చేసి అధిక ధరకు అమ్ముకుంటున్నారు. ఇలా ఇసుక అమ్మడం అక్రమమంటూ ఈ వ్యాపారాన్ని

మిగతా 8వ పేజీలో...

పెరుగుతున్న నిర్మాణ భారం

ఇసుక వ్యాపారాన్ని నియంత్రించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై నిర్మాణపు భారం పెరిగింది. కొద్ది రోజులుగా స్థానికంగా దొడ్డు ఇసుక రూ.1,300కు టన్ను చొప్పున విక్రయిస్తుండగా ప్రస్తుతం రూ.1,800కు విక్రయిస్తున్నారు. రూ.1,500కు అందుబాటులో ఉన్న సన్న ఇసుక ప్రస్తుతం రూ.2,300కు విక్రయిస్తున్నారు. దీంతో నిర్మాణపు భారం పెరగడంతో చాలా మంది తమ పనులను నిలిపి వేశారు. ప్రభుత్వం మొత్తం లారీ లోడును కొనే వీలు కల్పిస్తున్నట్టు చెప్పినా పెదవాడికి మాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో రెండు గదులు నిర్మించుకునే వారు అవసరం మేరకు కాకుండా మొత్తం లోడ్ కొనాల్సిన దుస్థితి.

పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర కీలకం

కడ్తాల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర కీలకమని ప్రముఖ పర్యావరణవేత్త సాయిభాస్కర్‌రెడ్డి, అయిస్టర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సింగాడే సునీల్ అన్నారు. ప్రకృతి ప్రాముఖ్యత గూర్చి విద్యార్థులు ప్రాథమికదశ నుంచే గుర్తించి మసలుకోవాలని వారు అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలో గల ది ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్‌గ్రీన్ రెవల్యూషన్, అయిస్టర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన సస్టైనబుల్ ఎకో అడ్వెంచర్ శిబిరం ఆదివారం సాయంత్రం ముగిసింది. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు, యువకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులకు అడవులు, జంతువుల పరిరక్షణ, జీవవైవిధ్యాన్ని దాని ప్రాముఖ్యతగురించి వివరించారు. పర్యావరణ పరిరక్షణపై ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ సీజీఆర్ చేస్తున్న కృషిని వారు కొనియాడారు. కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ ప్రతినిధులు జ్ఞానేశ్వర్, రజనీకాంత్, అయిస్టర్ సంస్థ కోశాధికారి అనంత శర్మ, అరవింద్, వెంకటేశ్, శివ, కృష్ణవేణి, రామకృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన భాస్కర్ రెడ్డి, సునీల్

పౌరాణిక నాటకాలతో నైతిక విలువలు

● వీహెచ్‌పీ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేశ్

షాద్‌నగర్ అర్బన్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక నాటక ప్రదర్శనలతో సమాజంలో నైతిక విలువలు పెరుగుతాయని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేశ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరం పుణ్యక్షేత్రంలోమహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురష్కరించుకుని శనివారంరాత్రి శ్రీసత్య హరిశ్చంద్ర పద్యనాటకాన్నిప్రదర్శించారు. దేవాదాయధర్మదాయ శాఖ, భాషా సంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర టెలివిజన్ అండ్ నాటకరంగ అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నాటక ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా బండారి రమేశ్ హాజరై మాట్లాడారు. సమాజం సాంకేతిక విప్లవం అంటూ పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దూరమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజానికి నీతి, నిజాయితీ, సేవా భావాన్ని వివరించే పౌరాణిక నాటికలు, కథలు ఎంతో అవసరమని ఆయన అన్నారు. నానాటికీ మరుగునపడుతున్న పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తున్న కళాకారులకు రమేశ్ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. మయసభ ఏకపాత్రాభినయం డి.కాశన్న, శ్రీకృష్ణుడుగా జేఎస్‌వీ శివప్రసాద్, అర్జునుడిగా ఎస్.ప్రవీణ్‌కుమార్, దుర్యోధనుడిగా యం.భాస్కర్‌గౌడ్, హరిశ్చంద్రుడిగా టి.కృష్ణ, చంద్రముఖిగా కె.వనజ కుమారి తదితరులు తమ పాత్రలతో అలరించి, ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గుండేడ్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ఇంటింటి సర్వే

తలకొండపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడకల్ గ్రామంలో సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. నాయకులు బృందాలుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో అనేక మంది నిరుపేదలు తమకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు లేవని తెలిపారు. రేషన్ కార్డులు, పింఛన్లు, అంతర్గ మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణం గురించి సీపీఎం నాయకులకు వివరించారు. దశాబ్దాలుగా ఇళ్లు లేక దుర్భర జీవితాలు వెల్లదీస్తున్నారని వారు అన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారిస్తామన్నారు.పెంటయ్య, రమేశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల ఆందోళన

» హైదరాబాద్‌కు బస్సులు నడపాలంటూ ఆందోళన


పరిగి బస్‌స్టేషన్‌లో ధర్నాకు దిగిన ప్రయాణికులు

పరిగి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పరిగి నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు వేయాలని కోరుతూ ఆదివారం రాత్రి పరిగి బస్టాండ్‌లో ప్రయాణికులు ధర్నా చేశారు. రాత్రి 9 గంటలకు చివరి బస్సు ఉందని చెబుతున్నా ఎనిమిది గంటల తర్వాత అసలు హైదరాబాద్‌కు బస్సులు లేవని నిరసిస్తూ ప్రయాణికులు నిరసనకు దిగారు. ఆర్టీసీ ముందుగా నిర్ణయించిన సమయాల మేరకే బస్సులు నడిపిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రయాణికులు అసలు ఇబ్బందులకు గురి చేయమని తెలిపారు. చివరి బస్సు తొమ్మిది గంటలకు ఉంటుందని, ఆ ప్రకారమే నడినిస్తామని, కొన్ని సందర్భాల్లో ఆలస్యం కావొచ్చని చెప్పి డిపో అధికారులు నచ్చజెప్పి ఓ బస్సు వేయడంతో ప్రయాణికులు అందులో వెళ్లారు.

సీఎంను కలిసిన మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ దంపతులు


సీఎంను కలిసిన మంజుల రమేష్ దంపతులు

వికారాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ సమక్షంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ మంజుల రమేష్ దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర అభివృద్ధి, వికారాబాద్ మునిసిపాలిటీకి సంబంధించిన విషయాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో మున్ముందు మరింత సహకారం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని అభ్యర్థించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.


పులుమద్ది గ్రామంలో బీరప్ప స్వామిని దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

పులుమద్దిలో బీరప్ప జాతర

» హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులుమద్ది గ్రామంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు బీరప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. స్పీకర్‌ను గ్రామస్థులు సన్మానించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

» దాతల సహకారం మరువలేనిది

» మోడల్‌గా జూనియర్ కళాశాల నిర్మాణం

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులందరికీ అన్ని వసతులతో కూడిన భవనంలో నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. దాతల సహకారంతో నిర్మిస్తున్న షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం మొదటి స్లాబ్ పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి పూనుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా పైసా తీసుకురాకుండా దాతల సహకారంతో రాష్ట్రంలోనే మోడల్ కళాశాల భవనాన్ని నిర్మించాలన్న ఆలోచనతో అన్ని పార్టీలను ఆహ్వానించి, డిసెంబరులో పనులు ప్రారంభించినట్లు గుర్తుచేశారు. మొదటి స్లాబ్ పూర్తయ్యాక మరో రెండు స్లాబ్‌లు వేస్తామని తెలిపారు. ప్రతీ ఫ్లోర్‌లో 14 విశాలమైన తరగతి గదులు, మూత్రశాలలు ఉంటాయని తెలిపారు. మొదటి స్లాబ్‌కే రూ.3కోట్ల వరకు ఖర్చు వచ్చిందని, భవనం పూర్తి కావడానికి రూ.15 కోట్లు కావొచ్చన్నారు. షాద్‌నగర్ నియోజక వర్గంలోని పేద విద్యార్థులందరూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చి నాణ్యమైన విద్య పొందేవిధంగా వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. భవన నిర్మాణానికి దాతల సహకారం కూడా బాగుందన్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మోడల్ భవనాన్ని నిర్మించి చూపిస్తానని తెలిపారు. భవన నిర్మాణ పనులను చెంది తిరుపతిరెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్‌లు చక్కగా చూస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమానికి హాజరైన మోతుకులగూడ గ్రామానికి చెందిన జెట్ట మహేందర్ రూ.40వేల విరాళం ఇచ్చారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.


నిర్మానుష్యంగా రోడ్డు

భానుడి భగభగ!

» ఉదయం 10గంటలకే మండుతున్న ఎండలు

» మధ్యాహ్నం రోడ్లపై కనిపించని జనం

యాలాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలం వేడిమి మొదలైంది. మార్చి మొదటివారంలోనే భానుడి భగభగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఎండ తీవ్రత పెరగక ముందే గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. వయస్సుపైబడిన వారు ఎండ తీవ్రతకు ఇంటిపట్టునే ఉంటున్నారు. మార్చి మొదటి వారంలోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఏవిధంగా ఉంటాయోనని ప్రజల్లో ఆందోళన నెలకొంది.

స్వచ్ఛ సర్వే షురూ

పట్టణాలకు స్వచ్ఛ ర్యాంకులు.. 10 అంశాలపై అభిప్రాయ సేకరణ

ప్రజాభిప్రాయమే ప్రామాణికం



తాండూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ర్యాంకుల ప్రక్రియ ప్రారంభమైంది. మున్సిపాలిటీల పరిధిలో స్వచ్ఛత, పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రజాభిప్రాయ సేకరణ మొదలైయింది. భారత ప్రభుత్వం పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 సర్వేను పట్టణాల్లో చేపట్టింది. పట్టణంలోని జనాభాలో 30శాతం మంది ప్రజాభిప్రాయాన్ని ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా సేకరిస్తారు. మార్చి 31వరకు పట్టణాలలో ఎన్విరాన్‌మెంటల్, పారిశుధ్య విభాగాల ఆధ్వర్యంలో ఈ సేకరణ జరుగుతుంది. ఈ సర్వేలో ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను బట్టి మున్సిపాలిటీలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ర్యాంకులను కేటాయించనున్నారు. స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0 సిటిజన్ ఫీడ్‌బ్యాక్ కింద ఈ సర్వే చేపట్టారు.

ప్రత్యేక యాప్

స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహించేందుకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కానింగ్ చేస్తే సర్వేఫారం, ఓటీపీ నంబర్ వస్తుంది. మీ పరిసరాల్లో స్వచ్ఛతను సాధించడంతో పొందిన పురోగతిపై సర్వేలో 10 ప్రశ్నలు ఇచ్చారు. అక్కడ పొందుపర్చిన సమాధానాల్లో ఒకదాన్ని ఎవరికి వారు ఎంచుకుని ఓటీపీ సంఖ్యను జతచేసి పంపాల్సి ఉంటుంది.

10 అంశాలు ఇవే..

రోజూ చెత్త సేకరించడానికి ఎవరైనా మీ ఇల్లు, షాపునకు వస్తారా? వ్యర్థాలను విభజించి వాహనంలోకి లోడ్ చేస్తారా? అన్నింటిని కలిపేస్తారా? మీ ప్రాంతంలో చెత్త కుప్పలు, చెత్త పేరుకుపోవడం కనిపిస్తోందా? మీ ఇంట్లో వ్యర్థాలను వడేసి తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారా? మార్కెట్‌లో, బజారులో పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటించడంలో అధికారులు ప్రభావంతంగా ఉన్నారా? మీ ప్రాంతంలో చెత్త వ్యర్థాలను నిర్వహించే ట్రిపుల్-ఆర్ కేంద్రాల గురించి మీకు తెలుసా? మురుగు కాల్వలు, సెప్టిక్ ట్యాంకులకు శుభ్రం చేయడానికి లైసెన్సు పొందిన ఆపరేటర్లను నియమించుకోవాలని మీకు తెలుసా? కనిపించే చెత్త, క్రమం తప్పకుండా ఊడ్చే విషయంలో నివాసముండే ప్రాంతంలో ఎలా రేట్ చేస్తారు? అనే అంశాలు ఉన్నాయి.

#Alert# Swachh Survekshan Feedback Started

Citizens can give feedback via Vote For My City App, Swachhata App & QR codes.
Scan the QR code / visit sbmurban.org/feedback

బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చడమే లక్ష్యం



గ్రామాలు, నగరాలు, పట్టణంలో బహిరంగ మల విసర్జన రహితంగా మార్చాలనే లక్ష్యంతో స్వచ్ఛ సర్వేక్షణ్ చేపట్టారు. పరిశుభ్రత, పారిశుధ్యానికి సంబంధించి వార్షిక సర్వేను అక్టోబరు 2, 2019 నుంచి చేపడుతున్నారు. ఐదేళ్లుగా పారిశుధ్యంలో మెరుగైన సేవలందించి పట్టణాలకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ ర్యాంకులను ప్రకటిస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా అవార్డులు వస్తాయి. ఇప్పటికే సర్వే ప్రారంభమైంది. మార్చి 31వరకు సర్వే కొనసాగుతుంది.

\- ప్రవీణ్ గౌడ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ తాండూరు

వాలీబాల్ పోటీల్లో ఏదుబాలాద్ జట్టు విజేత

అలరించిన జిల్లా స్థాయి క్రీడాపోటీలు

మేడ్చల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ఏదులాబాద్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో ఏదులాబాద్, కౌకూర్ జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. ఏదులాబాద్ జట్టు క్రీడాకారులు చాకచక్యంగా ఆడి విజయం సాధించారు. ఈ సందర్భంగా కీసరగుట్ట ట్రస్టు బోర్డు సభ్యుడు సామల అమరేందర్, రిటైర్డ్ పీఈటీ రమేశ్ రెడ్డి, సీనియర్ కోచ్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు బత్తుల శ్రీధర్, బింగి యుగేందర్, మాయ యాదయ్య, నాయకులు ఎంకే నాగరాజు, రాజేష్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 121 రోజుకు చేరాయి.

అంజిలయ్యగౌడ్ పాటలు ఆదర్శం

» ఎమ్మెల్సీ, వాగ్గేయకారుడు గోరటి వెంకన్న


అంజిలయ్యగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోరటి వెంకన్న, భాస్కరయోగి

పరిగి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలకు మాలెల అంజిలయ్యగౌడ్, పాటలు ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్సీ, వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. పీఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలో ఇటీవల మృతి చెందిన ఎం.అంజిలయ్యగౌడ్ సంతాపసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ.. అంజిలయ్య గౌడ్ తమలాంటి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఆయన లేనిలోటు తీరనిదన్నారు. అంజిలయ్య ఆశయసాధనకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, మాజీ అధ్యక్షుడు కరణం ప్రహ్లాదరావు, టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యులు వెంకటయ్యగౌడ్, వేముల పెంటయ్య, పీఎస్‌పీఎస్ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, నాయకులు బందెయ్య, పరందాములు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరిని ఆధ్యాత్మిక దారిలోకి తీసుకురావాలి

ప్రతీఒక్కరిని ఆధ్యాత్మిక దారిలోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ పి.భాస్కరయోగి ఆధ్వర్యంతో పరిగిలోని శ్రీనివాసనగర్‌కాలనీలో జరిగిన ఫాల్గుణ సత్సంగంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక పరంపరలో అవదూతలు రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ మహాత్ములతో కలగలిపి ఉన్నాయన్నారు. సామాన్యుల జీవితాలను ఆధ్యాత్మిక మార్గంలోకి తీసుకొస్తాయని చెప్పారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ పి.భాస్కరయోగి మాట్లాడుతూ.. పరమాత్మ వైపు అడుగులు వేయాలంటే భక్తి హృదయంలో నిలబడాలన్నారు. అది ఆరిపోని జ్యోతిలా వెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ అధ్యక్షుడు కరణం ప్రహ్లాద్‌రావు, పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, నాయకులు వీరేష్, పెంటయ్యగుప్త, ఆంజనేయులు, పాండుచారి పాల్గొన్నారు.

శనగ సాగుపై అనాసక్తి

» గతేడాదితో పోలిస్తే తగ్గిన విస్తీర్ణం

» తాండూరులో 300 ఎకరాల్లో పంట సాగు


తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలో సాగవుతున్న శనగ పంట

తాండూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మండలంలో శనగ పంటను అత్యధికంగా సాగుచేసే రైతులకు రానురాను ఈ పంటపై ఆసక్తి తగ్గిపోతుంది. వాణిజ్య పంటపై మొగ్గుచూపడంతో శనగపంటను వేసేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఆశించిన స్థాయిలో పంట చేతికిరాకపోవడం, పెట్టుబడులు కూడా రాకపోవడం వంటి తదితర కారణాలతో శనగ పంట సాగుపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తాండూరు మండలంలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది శనగ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. మండల పరిధిలోని సంగెంకలాన్, జినుగుర్తి, సంకిరెడ్డిపల్లి, కొత్లాపూర్, సంకిరెడ్డిపల్లి తండా, గుండ్లమడుగుతండా, ఉద్దండాపూర్, పర్వతాపూర్, బెల్కటూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, ఓగీపూర్ తదితర గ్రామాలతోపాటు మండలంలో సుమారు 300ఎకరాల్లో శనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు. అయితే శనగపంట సాగు చేయడం మూలంగా రైతుకు పెద్దగా సాగు చేకూరడం లేదన్న ఉద్దేశంతో ఈ పంటపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వాణిజ్య పంటైన పత్తిపై అత్యధికంగా రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా పత్తిపంటపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో ఎకరానికి పత్తి సుమారుగా 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులంతా ఎక్కువ పత్తి పంటనే విత్తుకోవడంతో శనగపంటపై ఆసక్తి చూపలేదు. గతేడాది మండలంలో 450ఎకరాల్లో వేరుశనగ పంట సాగుచేయగా, ఈ ఏడాది పూర్తిగా పంట సాగు తగ్గిపోయింది. కేవలం 300 ఎకరాల్లో మాత్రమే శనగ పంట పరిమితమైంది.


సమావేశంలో ఐక్యతను చాటుతున్న నాయకులు

యువత ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి

పెద్దేముల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా యువత ఆదర్శవంతమైన ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని బీసీసంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని గొట్లపల్లి గ్రామంలో ఆదివారం బీసీ యువజన సంఘం అధ్యక్షుడు నవీన్ అధ్యక్షతన యువజన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ బీసీసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో యువత బీసీ హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు షుకూర్, మండల అధ్యక్షుడు రేగొండి శ్రవణ్‌కుమార్, మండల మహిళా అధ్యక్షురాలు శివలీల, నాయకులు యాలటి శ్రీనివాస్, ఉప్పరి శ్రీనివాస్, అరుణ్‌రాజ్, బస్వరాజ్, మల్లన్న, నారాయణ, చంద్రప్ప, గోరెపటేల్, కుర్వశేఖర్, శ్రీశైలం పాల్గొన్నారు.

మతం కంటే మానవత్వం మిన్న

» ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి


ఆమనగల్లు : ఇఫ్తార్ విందులో ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సర్వ మానవాళి శ్రేయస్సే అల్లా ధ్యేయమని, ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కులం, మతం కంటే మానవత్వం గొప్పదని అన్ని మతాల సారాంశం అదేనని ఆయన అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మజీద్ లలో ఆదివారం రంజాన్ మాస ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణానికి చెందిన మైనారిటీ నాయకులు అబ్దుల్ జబ్బార్ నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అబ్దుల్ ఖాదర్, కరీం, రహీమ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లింలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. తొలిరోజు ఉపవాస దీక్ష విరమించిన ముస్లింలకు పండ్లు అందజేశారు. వంశీచంద్‌రెడ్డిని ఖాదర్ ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. సమాజంలో శాంతి స్థాపనకు, సర్వమానవాళి శ్రేయస్సు కోసం అందరు కృషి చేయాలన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతీ ముస్లిం ఉపవాస దీక్షలు పాటించాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు మండ్లీ రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, మానయ్య, బీచ్యానాయక్, మోతిలాల్, కాంగ్రెస్, మైనార్టీ నాయకులు ఖలీల్, కృష్ణానాయక్, జబ్బార్, మాసూమ్, గౌస్, ఫరీద్, అల్తాఫ్, సాధిక్, రహీమ్, రబ్బాని, అలీం, రజాక్, మహబూబ్, చాంద్ పాషా, జమీల్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీశైలం, పాండురంగయ్య, కాలే మల్లయ్య, మహేశ్, సురేశ్ నాయక్, బీక్యనాయక్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కడ్తాల మండల కేంద్రంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక మసీద్‌లలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మసీద్‌లలో ఆత్మీయ సమ్మిళిత సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజు దీక్షలు చేపట్టిన ముస్లింలకు పండ్లు అందజేసి దీక్షలను విరమింపజేశారు. మసీద్‌లలో తాగునీటి ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, మౌలిసాబ్, అబ్దుల్ రాహూఫ్, జానిమీయా, లాయక్ అలీ, జహంగీర్‌అలీ, జావేద్, ఈర్షాద్, ఇమ్రాన్, నాయకులు పాండు, రామచంద్రయ్య, వెంకటేశ్, మహేశ్, చెన్నయ్య, సురేశ్, బాబులు, యాదయ్య, రాజు, కరుణాకర్, శ్రీకాంత్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న భీమ్‌భరత్

నవాబుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, ప్రభావతి, బందెయ్యగౌడ్, సామ వెంకట్‌రెడ్డి, కొండల్ యాదవ్, మంజుల, ప్రసాద్, శబరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం మత్తులో గ్రామాలు!

- పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు
- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కోట్‌పల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలు మద్యంమత్తులో మునిగిపోతున్నాయి. ఉదయం మొదలుకొని రాత్రి 12 దాటినా కిరాణ షాపులు, రోడ్డు పక్కన డబ్బాల్లో ఎక్కడబడితే అక్కడ మద్యం అందుబాటులో ఉంటోంది. ఒకటీ రెండు గ్రామాలు మినహా మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలో మొత్తం 18 గ్రామపంచాయతీలకు గానూ మోత్కుపల్లి, బార్వాద్, రాంపూర్, జిన్నారం, ఎన్నారం, బీరోల్, నాసన్‌పల్లి, కంకణాలపల్లి, ఇందోల్, ఒగ్లపూర్, ఎన్కెపల్లి, కంకణాలపల్లి, అన్నసాగర్, తదితర గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. దీంతో గ్రామాల్లో చిన్నాపెద్దా తేడా



లేకుండా మత్తులో మునిగిపోతున్నారని గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ ధరలకు దొరికే మద్యానికి బెల్టుషాపుల్లో రూ.20 నుంచి రూ.30 అదనంగా దొరికినంత దోచుకోవడంతో కొనుగోలుదారులకు భారంగా మారింది. గ్రామాల్లో 4 నుంచి 8బెల్టుషాపులు, చిన్న గ్రామాల్లో 1 నుంచి 2 బెల్టుషాపులు ఉండటంతో మందుబాబుల ఇష్టారాజ్యంగా మారింది.

బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహించినట్లు మా దృష్టికి వస్తే ఎలాంటి వారినైనా వదిలేది లేదు. అమ్మిన వారిపై చర్యలు తీసుకుని గ్రామాల్లో ఎక్కడా బెల్ట్‌షాపులు నడవకుండా చూస్తాం.

- బాలగంగాధర్, ఎక్సైజ్ సీఐ తాండూర్

మద్యం మత్తులో ప్రమాదాలు

గ్రామాల్లో మద్యం మత్తులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బెల్టుషాపులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో అర్ధరాత్రులు మద్యం సేవించి మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. మద్యానికి బానిసై రోజుకు రూ.500 సంపాదించే వారు అందులో సగం మద్యానికి ఖర్చు చేస్తూ ఆర్థిక సమస్యలు, గొడవలతో కుటుంబాన్ని రోడ్డున పడేస్తున్నారు. దీనికి కారణంగా గ్రామాల్లో బెల్టుషాపులేనని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టుషాపులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలి మృతి

వికారాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతిచెందింది. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ బస్ డిపోకు చెందిన బస్సు వికారాబాద్ నుంచి తాండూరు వెళుతుండగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మూల మలుపులో యాచకురాలిని ఢీకొట్టింది. బస్సు కింద పడిన యాచకురాలు(65) తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వికారాబాద్ మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురిలో భద్రపర్చారు. ఎవరికైనా యాచకురాలు (వృద్ధురాలి) ఆచూకి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మద్యం షాపులో చోరీ

- బీర్లు తాగి రూ.2.30 లక్షల అపహరణ

పరిగి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని ఓ మద్యం షాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. పరిగి మునిసిపల్ పరిధిలోని కొడంగల్ చౌరస్తాలో గల భవాని మద్యంషాపులో శనివారం అర్ధరాత్రి ఓ దొంగ షెట్టర్ తాళం విరగ్గొట్టి లోపలికి చొరబడ్డారు. దొంగ షాపులో ఉన్న రెండు బీర్లు తీసుకొని అక్కడే తాగాడు. కలెక్షన్ బాక్స్‌లో ఉన్న రూ.2.30లక్షల నగదును తీసుకెళ్లాడు. ఈ దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డయ్యాయి. మద్యంషాపు యజమాని ఫిర్యాదు మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ ప్రాంతంలో చెట్ల తొలగింపు

- జేసీబీని స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

యాలాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో జేసీబీతో అక్రమంగా చెట్లను తొలగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు జేసీబీనీ స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కమాల్‌పూర్-2 కంపార్ట్‌మెంట్ నెంబర్-118 అటవీ భూమిలో, అన్నసాగర్‌కు చెందిన బర్ల హనుమంతి, బర్ల మల్లయ్య అనే వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీతో రెండు రోజులుగా చెట్లను తొలగించి చదును చేస్తున్నారు. ఆదివారం చెట్ల నరికివేత విషయం తెలుసుకున్న అటవీ ఎఫ్ఎస్‌వో శంకర్, ఎఫ్‌బీవో కాశన్న, ధారూర్ అటవీ సంరక్షణ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి వెళ్లి చెట్లను తొలగిస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకుని తాండూరు రేంజ్ కార్యాలయానికి తరలించారు. చెట్లను నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతా మా ఇష్టం!

(5వ పేజీ తరువాయి)

అక్కడ రోడ్డు పనులు చేస్తూ ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్న దుస్థితి. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.


ప్రభుత్వ భూమిలో 40 ఫీట్ల రోడ్డు ఇలా..

డబ్బు ఇస్తామని ఆశచూపి

రాళ్లరప్పలు కొండల్లో ఉన్న సర్వే నంబర్ 164 ప్రభుత్వభూమిలో లావణి పట్టా కలిగిన కొందరూ రైతులకు వెంచర్ నిర్వాహకులు రోడ్డు వేసుకుంటామని అందుకు కొంత నగదు ఇస్తామని ఆశజూపి తీరా రోడ్డు పనులు మొదలు పెట్టిన వారిని పట్టించుకోక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సొంత లాభం కోసం తమని వాడుకొని, ఇప్పుడు డబ్బులు ఇవ్వడం లేదని మండి పడుతున్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా కిలోమీటర్‌కుపైగా రోడ్డు పనులను చేస్తున్నారు. ఆ దారి గుండా వెంచర్ వద్ద ఓ పెద్ద గేటును ఏర్పాటు చేసి ఎవరూ ఆ వైపు రాకుండా సెక్యూరిటీ గార్డులను పెట్టారు. అటువైపుగా ఎవరైనా వెళ్తే లోపలికి అనుమతించకుండా భయపెట్టి అక్కడి నుంచి పంపించేస్తున్నారు.


ప్రజాప్రతినిధుల సహకారంతోనేనా?

ప్రభుత్వ భూమిలో దర్జాగా రోడ్డు వేస్తున్న రియల్ వ్యాపారులకు ఎవరు సహకారం అందిస్తున్నారనే అంశంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఎవరైనా అధికారులు వారికి సహకారం అందిస్తున్నారా? లేక ప్రజాప్రతినిధులు దాని వెనుక ఉన్నారా? ప్రభుత్వం భూమిలో అంత పెద్ద ఎత్తున రోడ్డు వేస్తుంటే ఎందుకు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వినిస్తున్నాయి. ఆ భూమికి చెందిన రైతులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నా నిర్వాహకులు ఎందుకు పట్టించుకోవడం లేదు. ఎవరూ అడ్డు వచ్చిన ఈ రోడ్డు పనులు పూర్తి చేస్తామని సమాధానం చెబుతుండటంతో అనేక అనుమానాలకు తావిస్తోంది.

భయం.. భయం!

- మహిళ హత్య ఘటనతో గ్రామస్థుల ఆందోళన
- మందుబాబుల పనేనని అనుమానాలు

మర్పల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు దొంగతనానికి వెళ్లి హత్యచేసి ఆ ఇంటి ఆవరణలోని బావిలో పడేసిన ఘటన వెలుగు చూడటంతో గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కోటమర్పల్లి గ్రామానికి చెందిన కొందరు సదాశివపేట్, జహీరాబాద్, సంగారెడ్డి, తాండూర్, హైదరాబాద్‌తో పాటు తదితర పట్టణాలకు ఉపాధి నిమిత్తం గత కొన్నేళ్లుగా వలసవెళ్లారు. దీంతో తల్లిదండ్రులు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ ఒంటరిగా నివాసముంటున్నారు. ఈ క్రమంలో ఎన్నడూ లేనివిధంగా ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంట్లో చొరబడి హత్య చేయడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఆ గ్రామంలో ఒంటరిగా ఉన్న మహిళలు వారి కుమారులు, కూతుళ్లతో పట్టణాలకు బయలుదేరుతున్నారు. పట్టణాల్లో ఉండేందుకు తల్లిదండ్రులకు కష్టంగా ఉంటుందని తెలిసినా తప్పని పరిస్థితుల్లో వారిని వెంట తీసుకెళ్తున్నామని పలువురు చెబుతున్నారు. కోటమర్పల్లితో పాటు పరిసర గ్రామాల్లో ఒంటరిగా ఉండే వారు రాత్రి వేళల్లో ఇంట్లో నివసించేందుకు భయాందోళనకు గురవుతున్నారు.



మద్యానికి బానిసై హత్యలు?

మర్పల్లి మండలంలో ఏ గ్రామంలో చూసినా బెల్టుషాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన మద్యం దుకాణాలకు సమయ పాలన ఉంటుంది. కానీ గ్రామంలో రాత్రీ, పగలు తేడా లేకుండా మద్యం ఏరులై పారుతుండటంతో మద్యం బాబులు మద్యానికి బానిసై ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా వందకు పైగా బెల్టు షాపులు ఉన్నాయి. రాత్రి వేళల్లో జరిగిన దొంగతనాలు, హత్యలు మద్యం మత్తులోనే జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. బెల్టు షాపులను అరికట్టే అధికారులు కూడా వారికి వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపులకు నిబంధనలు విధిస్తూ ఏ బెల్టు షాపు దుకాణదారుడు అదే గ్రామంలో విక్రయించాలనే నిబంధనలు విధించారని సమాచారం. ఇలాగైతే గ్రామాల్లో దొంగతనాలు, హత్యలు అరికట్టేదెవరని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కుమార్‌గౌడ్


పరిగి వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం

పరిగి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పరిగి వాకర్స్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం ఆదివారం పరిగిలోని గంగాసదన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాకర్స్ అసోసియేషన్ కొత్త అధ్యక్షుడిగా కుమార్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధానకార్యదర్శి బుచ్చయ్యగౌడ్, గౌరవ సలహాదాడిగా కావలి హన్మంత్‌ముదిరాజ్, సలహాదారుడిగా శశిధర్‌లు ఎన్నికయ్యారు. వీరిని వాకర్స్ మిత్రులంతా కలిసి ఘనంగా సన్మానించారు. వాకర్స్ మిత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కొత్త అధ్యక్షకార్యదర్శులు తెలిపారు.

సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన మల్కయ్య



జాన్‌వెస్లీతో ఉప్పలి మల్కయ్య

యాలాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కామ్రేడ్ జాన్‌వెస్లీని యాలాల మండలానికి చెందిన కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య కలిశారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాలకు జాన్‌వెస్లీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్కయ్య అయనను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

'పొలాల్లోకి వెళ్లేందుకు దారి చూపండి'

తాండూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంతారం ఊరచెరువు అలుగు నుంచి లోపల సర్వేనెంబర్ 53/3అ లో 3 ఎకరాల పంట పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని గ్రామానికి చెందిన సుభాన్‌రెడ్డి అధికారులను కోరాడు. ఈ విషయంపై తాండూరు సబ్ కలెక్టర్ గతనెల ఫిబ్రవరి 17వ తేదీన తాండూరు సీఐ గత ఏడాది 26వ తేదీన సమస్య పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపాడు. అంతారం గ్రామానికి చెందిన సేరి సుభాన్‌రెడ్డి ఊరచెరువు అలుగు కాల్వ నుంచి తమ పొలం వరకు ప్రభుత్వ నక్షాలో పాణాది ఉన్నప్పటికీ తమ గ్రామానికి చెందిన కొందరు రైతులు తన పొలానికి వెళ్లకుండా అడ్డుపడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాత పాణాది నక్షను జేసీబీతో తొలగించడంతో తన పొలానికి వెళ్లలేక పంటసాగు చేసుకోవడం లేదని, దీంతో తమ పొలాన్ని బీడుగా వదిలేసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధిరారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తమకు పొలానికి వెళ్లేందుకు దారి చూపించి న్యాయం చేయాలని కోరారు.

తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడం సరికాదు

దోమ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం సరికాదని దోమ మండల బహుజన ఉద్యమకారుడు గార్లపల్లి మల్లన్న అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో దక్కాల్సిన వాటాపై ప్రశ్నించిన తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడం సరైంది కాదన్నారు. తీన్మార్ మల్లన్నను సస్పెండ్ అగ్రవర్ణాల కుట్రలో భాగమేనని ఆరోపించారు. ఇక నుంచి మల్లన్నకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

బొడ్రాయి ఉత్సవాలకు విరాళం


చిగురాల్‌పల్లి గ్రామస్తులకు విరాళాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిగురాల్‌పల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన సందర్భంగా గ్రామస్థులకు ఆదివారం రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఏటా ఆనవాయితీగా వచ్చే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ సర్పంచ్ వెంకటయ్య, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, తాజుద్దీన్, బాబు, జంగయ్య, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి భూమి పూజ


నూతన శివాలయగుడి నిర్మాణానికి భూమి పూజ

కోట్‌పల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బార్వాద్ గ్రామంలో ఆదివారం గ్రామస్తులు గ్రామంలో ని బక్కప్ప మందిరం సమీపంలోని గుట్ట మీద నూతనంగా శివాలయ గుడి నిర్మాణానికి భూమిపూజ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు మహేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, ఈశ్వరయ్య స్వామి, విజయ భాస్కర్ రెడ్డి, శేఖర్, నరేందర్ రెడ్డి, విఠల్ రెడ్డి, నాని ప్రసాద్, ఏ నరేందర్ రెడ్డి, అశ్విన్ రెడ్డి, రవీందర్ రెడ్డి కర్ణయ్య, మల్లేష్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో క్యూలో నిలిచిన భక్తులు

దుద్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతనెల 20వ తేదీ నుంచి 24 వరకు అమ్మవారి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. లక్షలాది మంది భక్తులు తరలివచ్చి ఆలయంలో పూజలు చేశారు.

వైభవంగా నాభిశిల ప్రతిష్ఠాపన

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామంలో నాభిశిల ప్రతిష్ఠాపనను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా నాభిశిల యంత్ర ప్రతిష్ఠాపన పూజలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ మాధవనంద సరస్వతి స్వామి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శాంతి పాఠం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచాక్షరి, అఖండ దీపారాధన, వృత్తిక కరణ యాగశాల ప్రవేశ యోగిని, వాస్తు క్షేత్రపాలన, నవగ్రహ, ముఖ్య దేవత స్థాపన, వివాహిత దేవిత పూజ, హోమం, మూలమంత్ర హోమం, సహస్ర లింగార్చన, శయ్యాధివాసం, తదితర పూజా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు.


మోమిన్‌పేట్: పూజలు నిర్వహిస్తున్న పురోహితులు


కోట్‌పల్లి: మార్కండేయ ఆలయంలో నాయకుల పూజలు

మార్కండేయ ఆలయంలో..

కోట్‌పల్లి: మండల కేంద్రంలోని శివ భక్త మార్కండేయ ఆలయంలో 8 వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యంత్ర ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, మహా మంగళహారతి, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి, మాజీ బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్ పటేల్, బీజేపీ దిశకమిటి మెంబర్ వడ్ల నందు, మార్కెట్‌కమిటీ చైర్మన్ అంజయ్య హాజరయ్యారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామిని ఆదివారం పరిగి బీజేపీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనెటి దర్శించుకున్నారు. పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, కేంద్ర టెలికాం అడ్వయిజర్ గణపూరం వెంకటయ్యగౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు కాటన్‌పల్లి అంజిలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, సీనియర్ నాయకులు హరికృష్ణయాదవ్, గాదె మహిపాల్, అనిల్, జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, మండల అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

తుమ్మ చెరువు కట్ట మైసమ్మ ఆలయంలో..

మేడ్చల్ ప్రతినిధి: పట్టణంలోని తుమ్మ చెరువు కట్ట మైసమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్స వేడుకలు చేపట్టడానికి భక్తులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారిని దర్శించుకోవటానికి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రవీందర్

మర్పల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యు.రవీందర్ అన్నారు. మండలంలోని గుర్రంగట్టు తండాలో ఆదివారం ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే కోట్లాది రూపాయలు మంజూరు చేసి తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. బూచన్‌పల్లికి ఎస్టీ వెల్ఫేర్ ద్వారా జాజిగుబ్బడి తండా నుంచి బూచన్‌పల్లి వరకు రూ.2కోట్లతో బీటీరోడ్డు నిర్మాణం, రూ.1.63కోట్లతో గుర్రంగట్టు తండా రోడ్డు, ఉపాధిహామీ పథకం, ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్‌డీ ఎఫ్ ప్రత్యేక నిధులతో సీసీరోడ్డు, రూ.9లక్షలతో గుర్రంగట్టు తండాలో తాగునీటి పైపులైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు.

మహేందర్‌రెడ్డికి ఘన నివాళి


ఉద్యమకారుడు మహేందర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న శుభ్‌ప్రద్‌పటేల్, నాయకులు

నవాబుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో మహేందర్‌రెడ్డి పాత్ర మరువలేనిదని రాష్ట్ర మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. మహేందర్‌రెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా శుభప్రద్‌పటేల్‌తో పాటు నవాబుపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి తదితరులు మహేందర్‌రెడ్డి విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాంత్ కుమార్, మహేశ్వర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, జగన్‌రెడ్డి, మల్లేశం, జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డితో ముదిరాజ్ సంఘం నాయకులు

దౌల్తాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని ముదిరాజ్ సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లో సీఎం నివాసంలో ఆదివారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొడంగల్‌లో ముదిరాజ్ భవనం నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించడంతో ముదిరాజ్ సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బొంరాస్‌పేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపూర్ గేటు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పాలబాయి తండా వరకు బీటీ రోడ్డు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్‌సింగ్, ధర్మేందర్‌సింగ్, చందర్‌నాయక్, హనుమంతునాయక్, మహాదేవ్‌సింగ్, రఘు, నిజేశ్, శ్రీను, సూర్య, రాహుల్, మల్లేశ్, శంకర్ పాల్గొన్నారు.

ఇసుకే.. బంగారమాయెనా!

(5వ పేజీ తరువాయి)

అడ్డుకుని డంప్ చేసిన ఇసుకను సీజ్ చేశారు. దీంతో వాటి ప్రభావం స్థానిక భవన నిర్మాణాలపై పడింది. ఫలితంగా వారం రోజులుగా మేడ్చల్ పరిధలో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఇసుక అక్రమ రవాణాను క్రమబద్ధీకరించడానికి వారం రోజులుగా విజిలెన్స్, రెవెన్యూ అధికారులు దాడులు అక్రమంగా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేస్తున్నారు. ఫలితంగా ఇసుక వ్యాపారస్తులు ఇసుక లోడ్‌లను తీసుకురావడం మానేశారు. ప్రస్తుతం మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద గల ఇసుక అడ్డా వద్ద అధికారులు దాదాపు 500 టన్నుల ఇసుకను సీజ్ చేశారు.

క్రషర్ డస్ట్‌కు పెరిగిన డిమాండ్

ఇసుక అందుబాటులో లేక పోవడంతో చాలా మంది నిర్మాణాలకు క్రషర్ డస్టు(రోబోస్యాండ్)ను వాడుతున్నారు. దీంతో క్రషర్ల యజమానులు రూ.350కు టన్ను చొప్పున విక్రయించే డస్టు(రోబో స్యాండ్)ను వంద రూపాయలు పెంచి రూ.450కు విక్రయిస్తున్నారు. దీంతో నిర్మాణాలు చేపట్టడం కష్టతరంగా మారిందని పలువురు అంటున్నారు.

ఖాళీగా భవన కార్మికులు

నిర్మాణాలు తాత్కాలికంగా నిలిపి వేయడంతో నిర్మాణ కార్మికులకు పని లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. వారం రోజులుగా ఇదే పరిస్థితి. ప్రతీ రోజు మేడ్చల్ లేబర్ అడ్డా పై నుంచి దాదాపు 150 మంది కార్మికులుంటే అందులో కనీసం పది మందికి కూడా పని దొరకని పరిస్థితి నెలకొంది.